త్రినేత్ర
సత్యం ధర్మం జ్ఞానం
Hyderabad
20 March, 2026
2:45 PM Edition
www.trinethra.news
360° Digital News




# తెలంగాణ బడ్జెట్ 3,24,234 కోట్లు

## విద్య, వ్యవసాయానికి పెద్దపీట!

- మూలధన వ్యయం - రూ.47,267 కోట్లు.. రెవెన్యూ వ్యయం - 2,34,406 కోట్లు
- శాసనసభలో ప్రవేశపెట్టిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.3,24,234 కోట్ల భారీ అంచనాలతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా పేర్కొన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి రూ.17,82,198 కోట్లుగా పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధిరేటు 10.7 శాతంగా నమోదైందని చెప్పారు. దేశ వృద్ధిరేటు ఎనిమిది శాతం ఉండగా, దానికంటే రాష్ట్ర వృద్ధి రేటు 2.7 శాతం అధికారంగా ఉందని వివరించారు. దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్‌డీపీ అయిదు శాతం వాటా కలిగి ఉందన్నారు.

లోపలి పేజీల్లో..




**తలసరి ఆదాయం:** 2025-26లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931 కి చేరుకుంది. ఇది దేశ సగటు కంటే 1.9 రెట్లు ఎక్కువ.

రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931 కాగా, దేశ తలసరి ఆదాయం రూ.2,19,575గా ఉందని చెప్పారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే రాష్ట్ర తలసరి ఆదాయం 1.9 రెట్లు ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రానున్న సంవత్సర కాలంలో తాము చేయాలనుకుంటున్న అభివృద్ధి కార్యక్రమాలను పేర్కొంటూ, తమ ప్రాధాన్యతలను వివరించారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే అన్ని రంగాలకు సమప్రాధాన్యం కల్పించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ పునరుజ్జీవనం, గాంధీ సరోవర్ ప్రాజెక్టులకు ప్రత్యేక కేటాయింపులు చేయకపోవడం గమనార్హం.

అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలన్నదే మా లక్ష్యం. అందుకోసమే అహర్నిశలు శ్రమిస్తున్నాం. ఈ రెండేళ్లలోనే రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తీసుకురాగలిగాం. ధీరోదాత్తుడు ఎన్నడూ తనకెదురైన అవరోధాలకు బెదరడు. అవరోధాలనే అవకాశాలుగా మలుచుకొని ముందుకు సాగుతాడు. మేమెంచుకున్న లక్ష్యాలవైపు అడుగులేయడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, లెక్క చేయక ముందుకు సాగుతున్నాం.

- డిప్యూటీ సీఎం భట్టి



బడ్జెట్ అంటే కేవలం సంఖ్యలు...
అక్షరాలు మాత్రమే కాదు... మన
జీవితం... మన భవిష్యత్తు.
కలలు కనే యువతకు భవిష్యత్తుపై
ఆశ కల్పించడం
ఆసరా కోసం చూసే
బలహీనులను ఆదుకోవడం
నీడలేని వారికి నీడకల్పించడం...
పంటపొలాలకు నీళ్లు పారించడం..
ఫలసాయం పెంచడం
కష్టపడే వారికి పని కల్పించడం
ఇష్టపడేలా పాలన అందించడం
ఒక్క మాటలో చెప్పాలంటే నేను
ప్రతిపాదిస్తున్న ఈ బడ్జెట్ తెలంగాణ
ప్రజల ఆశా దీపం.

- డిప్యూటీ సీఎం భట్టి




మేము పాలకులం కాదు. ప్రజలకు సేవకులం. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే పరిపాలన లక్ష్యం .. అని డాక్టర్ బాబా సాహెచ్ అంబేద్కర్ చెప్పారు. ఆయన చెప్పిన అడుగుజాడల్లోనే నడుస్తూ మా పాలన సాగిస్తున్నాం. ప్రజలు మాకు అప్పగించిన ఈ అధికారాన్ని ఒక బాధ్యతగా భావించి, ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకుపోతున్నాం.

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

# గ్రామాలకు పెద్దపీట

- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి: రూ. 33,688 కోట్లు

**తెలంగాణ రాష్ట్ర 2026-27 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మార్చి 20, 2026న శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. ప్రజల ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆయన స్పష్టం చేశారు. పన్నుల భారం లేకుండా సమతుల్యంగా ఈ బడ్జెట్‌ను తీసుకువచ్చినట్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.**



రాష్ట్ర అభివృద్ధి జోన్లు: రాష్ట్రాన్ని (కోర్ అర్బన్), (పెరి-అర్బన్), (రూరల్ అగ్రి) అనే మూడు ప్రధాన ఆర్థిక మండలాలుగా విభజించి అభివృద్ధి చేయనున్నారు.

కొత్తగా ప్రకటించిన కీలక పథకాలు ఇవే!

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా: జూన్ 2, 2026 నుండి రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా కల్పించనున్నారు.

విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకం: ప్రీ-ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ ఉదయం బ్రేక్ ఫాస్ట్‌గా అందిస్తారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం: ఇప్పటి వరకు పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇకపై ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఇంటర్ విద్యార్థులకు కూడా విస్తరిస్తున్నారు.


ఉద్యోగులకు నగదు రహిత వైద్యం (EHS): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని అమలు చేస్తారు. దీని ద్వారా 1,998 వ్యాధులకు 421 ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చు.

ఉద్యోగులకు ప్రమాద బీమా: ప్రభుత్వ ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 1 కోటి 20 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది.

సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం: రాష్ట్ర యువతకు విదేశాల్లో (UAE, జర్మనీ తదితర దేశాల్లో) సురక్షితమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు.

## • వివిధ శాఖలకు నిధుల కేటాయింపు రూ.కోట్లలో..

బడ్జెట్‌లో సంక్షేమానికి, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ శాఖల వారీగా చేసిన కేటాయింపులు ఇలా ఉన్నాయి.




## ప్రాజెక్టులకు 22,615 కోట్లు

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.22,615 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఒకటని తెలిపారు.

**పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం**

కాబట్టి ప్రస్తుతం కొనసాగుతున్న, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం, మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఎలిమినేటి మాధవ రెడ్డి శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (SLBC) ప్రాజెక్టు, ఉదయసముద్రం, డిండి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ ఎంబీసీ ఎత్తిపోతల పథకం, జాన్‌పాడ్ ఎత్తిపోతల పథకం, మోతె ఎత్తిపోతల పథకం, జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం, సీతారామ ఎత్తిపోతల పథకం, చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, గౌరవెల్లి ప్రాజెక్టు, ఎర్రుపాలెం జవహర్లాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, త్రివేణి సంగమం, పులిమడుగు వాగు, కుమరం భీం వాగు, చిక్మాను వాగు, కెరామేరి మండలంలోని అమ్మవారి మడగాస్కర్, లెండిగూడ-జైనూర్ (మంటో), రోసీ మాల్టా మినీ రిజర్వాయర్ మరియు ఇతర ముఖ్యమైన ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు.

# అప్పులు ఇంతింతై.. శక్తికి మించి భారమై

## 2026-27 నాటికి రూ.5.62 లక్షల కోట్లు

**తెలంగాణ రాష్ట్ర అప్పుల భారం క్రమంగా పెరుగుతోంది. 2026-27 వార్షిక బడ్జెట్ అంచనాల ప్రకారం రాష్ట్ర బహిరంగ మార్కెట్ రుణాలు, ఇతర అప్పులు కలుపుకుని మొత్తం పబ్లిక్ డెబ్ట్ రూ. 5.62 లక్షల కోట్లకు చేరనుందని ఆర్థిక పత్రాలు వెల్లడించాయి.**

**త్రినేత్ర.న్యూస్ :**

తెలంగాణ శాసనసభలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల లెక్కలపై ప్రభుత్వం స్పష్టమైన గణాంకాలను అందించింది. బడ్జెట్ పత్రాల్లోని 'పబ్లిక్ డెబ్ట్ ఔట్ స్టాండింగ్ (FRBM రుణాలు)' నివేదిక ప్రకారం, రాష్ట్ర అప్పుల భారం ఏటేటా పెరుగుతూనే ఉంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు నేపథ్యంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున బహిరంగ మార్కెట్ రుణాలపై ఆధారపడుతోంది

**జీఎస్డీపీ (GSDP)లో 29 శాతానికి అప్పులు**

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర మొత్తం అప్పులు రూ.5,62,363 కోట్లకు చేరుకుంటాయని బడ్జెట్ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (GSDP)లో 29 శాతానికి చేరనుంది. గత ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే ఇది అత్యధికం.

**గత నాలుగేళ్లలో అప్పుల పెరుగుదల తీరు ఇలా..**

బడ్జెట్ పత్రాల్లో పొందుపరిచిన వివరాల ప్రకారం, గత కొన్నేళ్లుగా రాష్ట్ర అప్పులు ఏ విధంగా పెరిగాయో ఈ కింది గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**2023-24 (వాస్తవ లెక్కలు):** మొత్తం అప్పులు రూ.3,98,655 కోట్లు (GSDP లో 27%).

**2024-25 (వాస్తవ లెక్కలు):** మొత్తం అప్పులు రూ.4,47,493 కోట్లు (GSDP లో 28%).

**2025-26 (సవరించిన అంచనాలు):** మొత్తం అప్పులు రూ.5,03,905 కోట్లు (GSDPలో 28%).

**2026-27 (బడ్జెట్ అంచనాలు):** మొత్తం అప్పులు రూ.5,62,363 కోట్లు (GSDP లో 29%)

**2026-27 బడ్జెట్ నాటికి ఉన్న అప్పుల పూర్తి వివరాలు (రూ. కోట్లలో)**

వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి చేరుకోనున్న రూ.5.62 లక్షల కోట్ల అప్పుల్లో ఏయే మార్గాల ద్వారా ఎంతెంత రుణాలు ఉన్నాయన్నది ప్రభుత్వం విడమరిచి చెప్పింది.

**బహిరంగ మార్కెట్ రుణాలు :** రూ.4,62,926 కోట్లు. (మొత్తం అప్పుల్లో అత్యధిక భాగం ఇదే).

**కేంద్ర ప్రభుత్వ రుణాలు :** రూ.22,345 కోట్లు.

**స్వయంప్రతిపత్తి సంస్థల రుణాలు :** రూ.14,309 కోట్లు.

**చిన్న మొత్తాల పొదుపు & ప్రావిడెంట్ ఫండ్:** రూ. 25,716 కోట్లు.

**రిజర్వ్ ఫండ్స్, డిపాజిట్లు :** రూ.37,067 కోట్లు.

అభివృద్ధి పనులు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, అలాగే ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వం ఈ మేరకు మార్కెట్ రుణాలను సమీకరించాల్సి వస్తోందని బడ్జెట్ లెక్కలు తెలియజేస్తున్నాయి.



## ఉద్యోగులకు ఆరోగ్య భద్రత

త్రినేత్ర.న్యూస్:

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. ఉద్యోగస్తులు, పెన్షనర్లు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ ఈ పథకం వర్తిస్తుందని వెల్లడించారు. ఇది తాము కల్పించే భద్రత, భరోసా అని చెప్పారు.

**నగదు రహిత ఆరోగ్య భద్రత...**
రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 421 ఎంపానెల్ ప్రయివేట్ ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు చికిత్స పొందొచ్చని తెలిపారు. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డునూ అందిస్తామని పేర్కొన్నారు. దాదాపు 23 లక్షల 51 వేల మంది ఉద్యోగస్తులు, పెన్షనర్లు లబ్ధి పొందుతారని వివరించారు.

**సమగ్ర ప్రమాద బీమా పథకం..**
ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారి సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు భట్టి పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. కోటీ ఇరవై లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. 60 ఏండ్ల వరకు 10 లక్షల రూపాయల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.2 కోట్ల అదనపు కవరేజీ లభించేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు స్పష్టం చేశారు. ఇది 7 లక్షల 57 వేల ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తించనున్నట్లు వెల్లడించారు.

## రాజీవ్ యువ వికాసానికి రూ. 6 వేల కోట్లు

త్రినేత్ర.న్యూస్:

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన యువతకు ఆర్థిక సాయం అందించే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసానికి (రూ. 6 వేల కోట్లు ప్రతిపాదించినట్లు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 4,200 మందికి ఆర్థిక సహాయం అందిస్తారు.

- **రూ. 50,000 వరకు ఖరీదు చేసే యూనిట్లకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీని అందిస్తుంది.**
- **రూ. 50,001 నుంచి రూ. లక్ష మధ్య ఖరీదు చేసే యూనిట్లకు 90 శాతం, మిగిలిన 10% బ్యాంకు రుణాల ద్వారా నిధులు సమకూరుస్తారు.**
- **రూ.1,00,001 నుంచి రూ.2 లక్షల మధ్య ధర కలిగిన యూనిట్లకు, సబ్సిడీ 80 శాతం, 20 శాతం బ్యాంకు రుణం ఇస్తుంది.**
- **. రూ.2,00,001 నుంచి రూ.4 లక్షల వరకు ఉన్న యూనిట్లకు, ప్రభుత్వం ఖర్చులో 70 శాతం భరిస్తుంది. మిగిలినది బ్యాంకు రుణం ఇస్తుంది.**

# సోలార్ పంపు సెట్లకు 12 600 కోట్లు



**ఇందిర సౌర గిరి జల వికాసం పథకానికి రూ.12,600 కోట్లు కేటాయించిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకం ద్వారా 100 శాతం సబ్సిడీతో సోలార్ పంపు సెట్లను అందించి, వారి పురోగతికి ఇతోధికంగా తోడ్పడతామన్నారు. 6 లక్షల ఎకరాల పోడు భూముల్లో అటవీ ఉత్పత్తులకు సంబంధించిన తోటల పెంపకాన్ని ప్రోత్సహించి 2 లక్షల 10 వేల గిరిజన రైతులకు ఈ సౌకర్యం అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని ఇప్పటికే అచ్చంపేటలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని, దీని విధివిధానాలు అధ్యయనం చేసి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు.**

త్రినేత్ర.న్యూస్ :

ఇదిలా ఉండగా.. రాష్ట్రంలోని ఐకేపీ సంఘాల్లోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. అందుకోసం ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు బ్యాంకు ద్వారా రుణాలను ఇప్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.57,938 కోట్ల రుణం ఇప్పించామన్నారు. వీఎల్ఆర్ పథకం కింద 2023 డిసెంబర్ నుంచి ఈనాటి వరకు పట్టణ గ్రామీణ ఎస్‌హెచ్‌జీలకు 1,329 కోట్ల వడ్డీ రాయితీని విడుదల చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 67 లక్షల మహిళలతో ఐకేపీ బలమైన స్వయం సహాయక సంఘాల నెట్ వర్క్‌గా ఏర్పడిందన్నారు. మహిళా సంఘాలతో శిల్పారామంలో 106 స్టాళ్లతో ఇందిరా మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేశామని, ఈ సముదాయం ఉత్పత్తులు 7 కోట్ల 68 లక్షలకు చేరాయన్నారు. ఎస్‌హెచ్‌జీల ద్వారా 600 బస్సులను కొనుగోలు చేసి టీజీఎస్ ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించి, మొదటి దశలో 177 కోట్ల 84 లక్షల రూపాయలతో 494 బస్సులను కొనుగోలు చేసిందన్నారు. నారాయణపేట, సంగారెడ్డిలలో 2 పెట్రోలు బంక్ లు ఏర్పాటు చేశామన్నారు. 28 పెట్రోలు బంకుల ఏర్పాటు పురోగతిలో ఉన్నాయన్నారు. మహిళా సాధికారతను మరింత బలోపేతం చేయడానికి ఇప్పటికే ఉన్న 10 జిల్లాలకు అదనంగా 22 జిల్లాలలో ఇందిరా మహిళా శక్తి భవనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

**ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అంటే.. ?**
కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గిరిజన రైతుల కోసం తీసుకువచ్చిన పథకమే ఇందిర సౌర గిరి జల వికాసం పథకం. పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరి రైతులకు ఈ పథకంలో సాగునీటి వసతి కల్పిస్తారు. గిరిజన రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వ సహాయ సహకారాలు అందిస్తుంది. విద్యుత్ సౌకర్యం లేని పోడు భూముల్లో సాగు చేసే గిరిజన రైతులందరికీ 100 శాతం సబ్సిడీతో సోలార్ పంపుసెట్లను ఉచితంగా ప్రభుత్వం అందిస్తుంది. నీటి వనరులు లేని భూముల్లో బోర్లు, బావులు తవ్వించి నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తారు. అంతే కాకుండా భూమిని సాగుయోగ్యంగా మార్చడం, విత్తనాలు, ఎరువులు, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. గిరి రైతులు కేవలం వర్షాలపై ఆధారపడకుండా నీటి వసతితో పంటలు పండించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రోత్సాహం అందిస్తుంది. అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు పొందిన రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులు. రెండున్నర ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు ఒక యూనిట్ వ్యక్తిగతంగా అందిస్తారు. అంతకన్నా తక్కువ భూమి ఉన్న రైతులను సమీపంలో ఉన్న రెండు నుంచి ఐదుగురు రైతులను గ్రూప్‌గా ఏర్పాటు చేసి వారికి ఈ యూనిట్ అందిస్తారు.





## తెలంగాణ బడ్జెట్ 2026 - 27

**మనల్ని మనం తెలుసుకునే ఉత్తమ మార్గం ఏమిటంటే, ఇతరులకు సేవ చేయడంలో మనల్ని మనం మరిచిపోవడం....**
**అని ఆనాడు మహాత్మాగాంధీ చెప్పిన విషయాలను గుర్తు చేసుకుంటూ ఈ రెండేళ్ళ పాలనలో ప్రజలకు మేమిచ్చిన వాగ్దానాలను, వారు మాపై పెట్టుకున్న ఆశలను సంతృప్తికరమైన స్థాయిలో నెరవేరుస్తూ వస్తున్నాం.**



## దివ్యాంగ విద్యార్థులకు శుభవార్త..

- **రెట్రోఫిట్టెడ్ వాహనాల పంపిణీకి నిర్ణయం**

త్రినేత్ర.న్యూస్ :

**రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో భాగంగానే స్కూల్ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దీంతో పాటు దివ్యాంగ విద్యార్థులకు కూడా విక్రమార్క శుభవార్త వినిపించారు. దివ్యాంగ విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదారస్వభావంతో ఉన్నదని తెలిపారు.**

మా ప్రభుత్వం విద్యార్థులు, వారి సాధికారత పట్ల అత్యంత చిత్తశుద్ధితో ఉంది. దివ్యాంగ విద్యార్థుల శారీరక వైకల్యం వారి విద్యాభ్యాసానికి, ప్రగతికి ఏమాత్రం అడ్డంకి కాకూడదు అనే ఉద్దేశ్యంతో, అటువంటి వారికి తగిన తోడ్పాటు అందించే లక్ష్యంతో ఇంటర్మీడియట్ విద్య చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ చేయాలని నిర్ణయించామని భట్టి విక్రమార్క తెలిపారు.

# ఆధ్యాత్మిక కేంద్రంగా రాజన్న గుడి

త్రినేత్ర.న్యూస్ :

రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పెంపొందించేందుకు భద్రాచలం, ధర్మపురి, వేములవాడ, కాళేశ్వరం వంటి దేవాలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి అవసరమైన నిధులు కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. వేములవాడ రాజన్న దేవాలయాన్ని పూర్తి స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో 2027 జూన్ 26 నుండి జూలై 7 వరకు జరుగనున్న గోదావరి పుష్కరాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సుమారు 8 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారనే అంచనా నేపథ్యంలో పుష్కరాల నిర్వహణ, రోడ్ల విస్తరణ, కొత్త ఘాట్ల నిర్మాణం, దేవాలయాల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో ఒక ప్రత్యేక క్యాబినెట్ సబ్–కమిటీని ఏర్పాటు చేసింది. పుష్కరాల నిర్వహణ కొరకు రూ. 500 కోట్లు కేటాయించింది. రాష్ట్ర దేవాదాయ శాఖ తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థతో కలిసి రాష్ట్రంలో తొమ్మిది కొత్త పవిత్ర యాత్రా సర్క్యూట్లను ప్రారంభించిందని గుర్తు చేశారు. ఈ యాత్రా సర్క్యూట్ల ద్వారా భక్తులకు వసతి సదుపాయాలు, ప్రత్యేక దర్శనం, పర్యాటక సౌకర్యాలు అందించబడుతున్నాయని వివరించారు.



# 6 గ్యారెంటీలకు 50,713 కోట్లు

**అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆ హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు మరో రెండేండ్లలో రానున్న నేపథ్యంలో సంక్షేమ పథకాలకు పెద్దపేట వేశారు. ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైంది.**

**ఆరు గ్యారెంటీలకు కేటాయింపులు ఇలా**

- రైతు భరోసా - రూ. 18000 కోట్లు
- చేయూత - రూ. 14861 కోట్లు
- ఇందిరమ్మ ఇండ్లు - రూ. 5,500 కోట్లు
- మహాలక్ష్మి (ఆర్టీసీ) - రూ. 4305 కోట్లు
- వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ - రూ. 3,500 కోట్లు
- గృహ జ్యోతి(200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్) - రూ. 2,080 కోట్లు
- రాజీవ్ ఆరోగ్య శ్రీ - రూ. 1,143 కోట్లు
- ఎల్‌పీజీ సబ్సిడీ - రూ. 723 కోట్లు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా - రూ. 600 కోట్లు



త్రినేత్ర.న్యూస్ :

ఇప్పటి వరకు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు గృహ జ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నారు. చేయూత పథకం ఇప్పటి వరకు అమలు కాలేదు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొనసాగుతోంది. వ్యవసాయ ఉత్పత్తులకు కూడా బోనస్ కార్యక్రమం సరిగా అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎల్‌పీజీ సిలిండర్లకు సబ్సిడీ రాలేదనే అపవాదులు ఉన్నాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కూడా ఇప్పటికీ అమలు కాలేదు. ఈ నేపథ్యంలో ఆరు గ్యారెంటీలకు రూ. 50,713 కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు.



## ప్రతి కుటుంబానికి 5 లక్షల బీమా

త్రినేత్ర.న్యూస్ :

**రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శుభవార్త వినిపించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం నడుం బిగించినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.**

సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్యతరగతి, ధనిక అని తేడా చూడకుండా రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా అందించే విధంగా 2 జూన్,2026 నుండి "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం" ను నూతనంగా ప్రవేశ పెడుతున్నామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.



## మహాలక్ష్మి పథకంతో మహిళలకు 9,222 కోట్లు

త్రినేత్ర.న్యూస్ :

రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసిన తొలి వాగ్దానం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ 2026–27 ను ఆయన ఇవాళ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకం ద్వారా తమ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతిరోజూ రాష్ట్రంలోని 34 లక్షల 37 వేల మంది ఆడ బిడ్డలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకూ ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు 269 కోట్ల 68 లక్షల ఉచిత ప్రయాణాలు చేసి.. దాదాపు రూ.9,222 కోట్లు ఆదా చేసుకున్నారని వివరించారు.

# రూ.500కే సిలిండర్‌తో..

## మహిళలకు రూ.752 కోట్లు ఆదా



**వంట గ్యాస్ సిలిండర్ భారం నుంచి మహిళలకు ఉపశమనం కల్పించేందుకు నెలకు రూ.500కే సిలిండర్ అందించే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించినట్లు గుర్తు చేశారు. దీని కింద రాష్ట్రంలోని 42,90,000 కుటుంబాలకు లబ్ధి చేకూరినట్లు చెప్పారు. దీని ద్వారా మహిళలకు రూ.752 కోట్లు ఆదా అయినట్లు వివరించారు.**

త్రినేత్ర.న్యూస్ :

గృహజ్యోతి పథకం ద్వారా సుమారు 53 లక్షల 9 వేల పేద, మధ్య తరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంట్ అందిస్తున్నట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటి వరకూ 10 కోట్ల 97 లక్షల రూపాయల సున్నా బిల్లులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సబ్సిడీ కింద 3 వేల 900 కోట్ల 54 లక్షల రూపాయలను విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం చెల్లించినట్లు వెల్లడించారు. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.



# తెలంగాణ బడ్జెట్ 2026 - 27

**గత ప్రభుత్వం చేసిన ఆర్థిక మరియు వ్యవస్థల విధ్వంసాన్ని సరిచేస్తూ, పాత అప్పులను, వాటి వడ్డీలను కట్టుకుంటూనే పాలనను గాడిలో పెట్టాము. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే, ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాం.**



## బడి పిల్లలకు పాలు.. రాగిజావ

త్రినేత్ర.న్యూస్ :

**రాష్ట్రంలోని ప్రాథమిక, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శుభవార్త వినిపించారు. స్కూల్ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్.. ఇంటర్ విద్యార్థులకు లంచ్ ఉచితంగా అందించనున్నట్లు తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ రెండు పథకాలను ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయబోతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు.**

**విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం:**
2026–27 విద్యా సంవత్సరం నుంచి ప్రీ–ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు పాలు, మిగతా మూడు రోజులు రాగిజావ అందిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు.

**ఇంటర్ విద్యార్థులకు లంచ్ :**
ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ అభ్యసిస్తున్న మన విద్యార్థులకు కూడా ఇకపై నూతనంగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నాం. విద్యార్థుల సంక్షేమం కోసం మనం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక సరికొత్త అధ్యాయానికి నాంది. కౌమారదశ అనేది ఎంతో కీలకమైన దశ, ఈ వయసులో తీసుకునే పోషకాహారమే వారి నేర్చుకునే సామర్థ్యాన్ని, దీర్ఘకాలిక ఆయుష్షుని నిర్ణయిస్తుంది అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.